# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 03 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఇద్దరు ఉగ్రవాదులు హతం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో శనివారం భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారని అధికారులు తెలిపారు. దక్షిణ కశ్మీర్ జిల్లాలోని అఖల్ వద్ద ఉన్న అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్లు నిఘావర్గాల నుంచి సమాచారం అందడంతో భద్రతా దళాలు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించిన తర్వాత రాత్రిపూట ఈ దాడి ప్రారంభమైంది. ఇరువర్గాల మధ్య శుక్రవారం సాయంత్రం జరిగిన తొలి కాల్పుల తర్వాత, రాత్రికి ఆపరేషన్ నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. 'కార్డెన్'ను బలోపేతం చేశారు, అదనపు బలగాలను ఆ ప్రాంతానికి తరలించారు. కాల్పులు శనివారం ఉదయం తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారని అధికారులు తెలిపారు. హతమైన ఉగ్రవాదుల గుర్తింపు, గ్రూప్ అనుబంధాన్ని ఇంకా నిర్ధారించాల్సి ఉందని, ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని వారు తెలిపారు.

# బీజేపీని 150 సీట్లు దాటనివ్వం



- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతాం
- 26 ఏండ్లుగా పదవిని పట్టుకుని వేలాడుతున్న మోడీ
- ఏఐసీసీ లీగల్ సెల్ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి
- గత లోక్‌సభ ఎన్నికల్లో 70 నుంచి 100 సీట్లలో బీజేపీ రిగ్గింగ్
- త్వరలో ఆధారాలు వెల్లడిస్తాం : ఎంపీ రాహుల్‌గాంధీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 150 సీట్లు దాటనివ్వమనీ, ఈ విషయాన్ని ఆపార్టీ నేతలు డైరీల్లో రాసుకోవాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. 'ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కుర్చీలో, ఓడితే ఇంట్లో కూర్చుంటాయి. కానీ గెలుపోటములతో సంబంధం లేకుండా కాంగ్రెస్‌పార్టీ ఎప్పుడూ ప్రజలతోనే ఉంది' అని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణలో ప్రధాని మోడీని ఓడించి కుర్చీ నుంచి దింపేందుకు రాహుల్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ శ్రేణులన్నీ ఐక్యంగా పోరాడతాయని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ లీగల్ సెల్ సదస్సులో 'రాజ్యాంగ సవాళ్లు- దృక్పథం- మార్గాలు' అనే అంశంపై ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఏం చేసిందని పదే పదే బీజేపీ వాళ్లు ప్రశ్నిస్తున్నారనీ, దేశానికి స్వాతంత్రం రాకముందే కాంగ్రెస్ పార్టీ ఉన్నదనీ, బ్రిటిషర్లతో పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిందే కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌ను యుద్ధంలో ఓడించి ఆదేశాన్ని రెండు ముక్కలు చేసిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీదే అని తెలిపారు. ఆమె ఉగ్రవాదుల నుంచి దేశాన్ని రక్షించారనీ, దేశం కోసం గాంధీజీ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణ త్యాగాలు చేశారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రధానమంత్రి మోడీని, బీజేపీని కాంగ్రెస్ పార్టీ ఓడిస్తుందని తేల్చిచెప్పారు. 2004లో ప్రధాని అయ్యే అవకాశం ఉన్నా, సోనియాగాంధీ ఆ పదవిని త్యాగంచేసి మన్మోహన్ సింగ్‌కు ఇచ్చారనీ, ప్రణబ్ ముఖర్జీని రాష్ట్రపతి చేశారని చెప్పారు. రాహుల్ గాంధీ కోరుకుంటే 2004లోనే కేంద్రమంత్రి, 2009లోనే ప్రధానమంత్రి అయ్యేవారనీ, కానీ ఆయన ఆ రెంటినీ త్యాగం చేశారని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీకి 'త్యాగాలు కొత్తేం కాదనీ, పార్టీలో సామాన్య కార్యకర్తగానే రాహుల్‌గాంధీ కొనసాగుతున్నారని చెప్పారు. పేదలు, దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, సామాజిక న్యాయం కోసం 25 ఏండ్లుగా రాహుల్‌గాంధీ పోరాడుతున్నారని కొనియాడారు. నరేంద్రమోడీ 2001 నుంచి కుర్చీ వదలడం లేదనీ, గుజరాత్ సీఎం అయింది మొదలు ఇప్పటి వరకు కుర్చీలోనే కూర్చుని ఉన్నారని అన్నారు. అందుకే ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ 75 ఏండ్లు నిండిన వారు కుర్చీ వదలాలని రెండు నెలల క్రితం చెప్పారని గుర్తుచేశారు. అద్వానీ, మురళీమనోహర్ జోషికి వర్తించే నిబంధనలు మోడీకి ఎందుకు వర్తించవని ప్రశ్నించారు. మోడీని ఆర్‌ఎస్‌ఎస్, వాజ్‌పేయీ కుర్చీ నుంచి దింపలేకపోయారనీ, వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ఆపని చేస్తారని స్పష్టంచేశారు. ఓబీసీలకు సామాజిక న్యాయం సాధించేందుకు రాహుల్ గాంధీ నేతత్వంలో పోరాడతామన్నారు.

**2024 లోక్‌సభ ఎన్నికల్లో భారీ మోసం**

2024 లోక్‌సభ ఎన్నికల్లో విస్తృత స్థాయిలో మోసం జరిగిందని కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వార్షిక లీగల్ కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, "ఇది ఎలా మోసపూరితంగా జరిగిందో, మేము రుజువు చేస్తాం. నాకు 100 శాతం సాక్ష్యాలున్నాయి' అని చెప్పారు.

రాహుల్ మాట్లాడుతూ, "ఎలక్షన్ కమిషన్ సహకరించకపోవడంతో మేమే లోతుగా పరిశీలించాం. మేము ఏం కనుగొన్నామంటే... అది ఒక అణుబాంబ్. అది పేలితే ఈ దేశంలో ఎన్నికల సంఘం కనిపించదు," అని విమర్శించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తిగా నష్టపోవడంతో అనుమానాలు మొదలయ్యాయని రాహుల్ తెలిపారు. "సమీపంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో విజయాల తరువాత అసెంబ్లీ ఎన్నికల్లో కరువు రావడం విచిత్రం అనిపించింది. ఆ సమయంలో నుంచే మేము ప్రొబింగ్ మొదలుపెట్టాం," అన్నారు.

"మా దర్యాప్తులో 6.5 లక్షల ఓట్లలో 1.5 లక్షలు తప్పుడు ఓట్లు గా గుర్తించాం. మొత్తం 70 నుంచి 100 స్థానాల్లో మోసం జరిగి ఉండొచ్చు. కనీసం 15 సీట్లు మారిపోయినా మోదీ ప్రధాని కావటం సాధ్యమే కాదు," అని గాంధీ చెప్పారు. ఈసీ పై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేస్తూ, "ఒత్తిడి వల్లే మేము స్కాన్ చేసిన ఓటర్ల జాబితా హార్డ్ కాపీలను అందుకోగలిగాం. డిజిటల్ డేటా ఇవ్వకపోవడం వెనక కారణం ఇప్పుడు స్పష్టం అవుతోంది," అన్నారు.

## ప్రశ్నించే గడ్డపైనే...
# ప్రశ్నించే గొంతు నొక్కడమా..



- భావ స్వేచ్ఛపై బీఎన్ఎస్ 163 యాక్ట్ తో ఉక్కుపాదమా
- నేను చేసింది తప్పు.. మీరు నన్ను ప్రశ్నించవద్దు అని బీఎన్ఎస్ 163 యాక్ట్ నోటిసు ఇచ్చిండ్రా..
- ప్రశ్నించే గొంతులపై నిషేధమా...?
- జర్నలిస్టు బాలు కాయితిపై బీఎన్ఎస్ 163 యాక్ట్ అమలు దుర్మార్గం
- దళిత సంఘాలనాయకులు
- సిరిసిల్ల లో ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రభుత్వ తీరుపై నిరసన

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా లో దళిత జర్నలిస్టులు,దళిత ఉద్యోగస్తులు మరియు దళితులపై జరుగుతున్నా దాడులను, జర్నలిస్ట్ కాయితి బాలుపై బిఎన్ఎస్ 163 యక్ట్ అమలు పౌర హక్కులను ఉల్లఘింస్తున్న ప్రభుత్వ యంత్రాంగం తీరు పై శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో కెవిపిస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దళిత జర్నలిస్ట్ పై 163 నిషేధం తీసుకురావడం భావ ప్రకటన స్వేచ్చకు భంగం కలిగిస్తున్నారని , జిల్లాలో ప్రశ్నించే గొంతులను తొక్కేస్తూ పౌర హక్కులకు భంగం కలిగిస్తున్నారని, దళితపై కక్షపూరితంగా వ్యవహరించడాన్ని తప్పు పట్టారు, దళిత ఉద్యోగులను పక్షపూరితంగా ట్రాన్సుర్లు చేసి ఇబ్బందులకి గురి చేస్తున్నారని మండిపడ్డారు.బాలు కాయితిపైన నిషేధం పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు వెంటనే 163 బిఎన్ఎస్ రద్దుచేసి నిషేధం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు, ట్రాన్సుర్ చేసిన, దళిత ప్రభుత్వ ఉపాధ్యాయులు యాదస్థానానికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో మా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**బీఎన్ఎస్ 163 యాక్ట్ నోటిసు ఎక్కడా కూడా మనుషులపై విధించలేదు : దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్**

బిఎన్ఎస్ 163 యాక్ట్ నోటిసు ఎక్కడా కూడా మనుషులపై విధించలేదు అని అన్నారు. ఉత్తరప్రదేశ్లో ఇండ్ల పైకి యోగి సర్కార్ బులోజర్లును పంపించి ఇల్లు కూల్చే సంస్కృతిని సిరిసిల్ల జిల్లాలో అమలు చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. బాలు కాయితీ ఇల్లు మున్సిపల్ పర్మిషన్ కొలతలు ప్రకారమే కట్టుకున్నాడని అన్నరు. కొలప్రకారం లలేకపోతే ఇన్ని రోజులు అధికారులు ఏం చేశారని అన్నారు. ఈ వ్యక్తిగత కక్ష ల ఆధారంగానే కు ఇబ్బందుల గురి చేస్తున్నారని అన్నారు. నేరెళ్ల ఘటనపై నిర్భయంగా వార్తలు వ్రాసిన వ్యక్తి గొంతు నొక్కడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. దళిత జర్నలిస్ట్ బాలు కాయితి, ఆయన సతీమణి ని ఇబ్బందులకు గురి చేస్తున్న వారి పై ఎస్సీ ఎస్టీ కమిషన్ ,అదేవిధంగా ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ చర్యలు తీసుకోవాలని అన్నారు.దళితులపై అన్ని ప్రాంతాల్లో దాడులు జరుగుతున్నాయని, వెంటనే దాడులు అరికట్టాలని, బాలు పై విధించిన బిఎన్ఎస్ 163 యాక్ట్ నోటీసులు వెనుకకు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామని అన్నారు.

బాలు కాయితి పై నిర్బంధం వెంటనే ఎత్తి వేయాలి
-కుల వివక్ష పోరాట సమితి జిల్లా కన్వీనర్ నాగరాజు

బాలుకాయితి పై నిర్బంధనం వెంటనే ఎత్తివేయాలని లేనిపక్షంలో ఆందోళన చేపట్టడానికి సిద్ధమని అన్నారు. ఏ పార్టీలో ఉన్న దళిత నాయకులు దళితులకు అన్యాయం జరిగితే ఏకతాటిపైకి రావాలని, ఇలాంటి ఘటనలకు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నదని అన్నారు. బాలు కాయితి 163 యాక్ట్ నోటిసు ఎత్తి వేయాలని, అక్రమంగా బదిలీ చేసిన వారి సతీమణి ని యధాస్థానానికి తీసుకురావాలని

మిగితా 4వ పేజీలో

## పహల్గాం దాడికి ప్రతీకారం తీర్చుకున్నాం : ప్రధాని మోడీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారత్ ఆర్థిక వ్యవస్థపై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరోక్షంగా గట్టి కౌంటర్ ఇచ్చారు. "డెడ్ ఎకానమీ" అంటూ ట్రంప్ చేసిన విమర్శలపై స్పందించిన మోడీ, భారత దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు వేగంగా ముందుకెళ్తోంది అని అన్నారు. భారత్‌పై ట్రంప్ విధించిన 25 శాతం టారిఫ్‌ల నేపథ్యంలో, దేశ ప్రజలు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని, ప్రతి వస్తువుపై 'భారతీయుల కష్టం' ఉండేలా చేయాలని మోడీ పిలుపునిచ్చారు. "స్వదేశీ సంకల్పాన్ని ప్రజలంతా తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి" అని ప్రధాని పేర్కొన్నారు. "గత ప్రభుత్వాలు రైతులకు హామీలు ఇచ్చినా అమలు చేయలేకపోయాయి. కానీ మన ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోంది" అని అన్నారు. ప్రభుత్వ దృఢ సంకల్పానికి పీఎం-కిసాన్ స్కీమ్ ప్రతీక అని పేర్కొన్నారు. సమాజ్ వాదీ పార్టీ, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని మోదీ సూచించారు. "ఎన్‌డీఏ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని తట్టుకోలేకే వారు దుష్ప్రచారాలు చేస్తున్నారు" అని విమర్శించారు.పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి ఆపరేషన్ మహాదేవ్‌ను ప్రస్తావించిన మోదీ, "మహాదేవుడి ఆశీస్సులతోనే ఆ దాడికి ప్రతీకారం తీర్చుకున్నాం" అని వెల్లడించారు. కానీ కొందరు ఆ ఆపరేషన్‌పై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారనే విషయంలో విపక్షాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఉగ్రవాదులు దొరికినప్పుడు వారాలు, తిథులు చూసుకుంటూ వదిలిపెట్టాలా? పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడి చేయగలగడం మన శక్తి. కానీ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు అది జీర్ణించడం లేదు" అని వ్యాఖ్యానించారు. "ఆపరేషన్ సిందూర్‌ను తక్కువచేసేలా మాట్లాడటం తగదు. సిందూర్ మా చెల్లెమ్మల పవిత్ర గుర్తు. దానిని ఎవ్వరూ అపహాస్యం చేయలేరు" అంటూ మోదీ స్పష్టం చేశారు.

## మంత్రి కొండా సురేఖకు షాక్

- కేటీఆర్ పరువు నష్టం దావా కేసులో క్రిమినల్ కేసు నమోదుకు కోర్టు ఆదేశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు షాకిచ్చింది. ఈ కేసులో ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోర్టు సంచలనాత్మకంగా ఆదేశించింది. ఈ నెల 21వ తేదీ లోపు కేసు నమోదు చేసి, నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేసింది. నటి సమంత విడాకులు, ఫోన్ ట్యాపింగ్ అంశాలపై కొండా సురేఖ తనపై నిరాధార ఆరోపణలు చేశారని, దీనివల్ల తన ప్రతిష్టకు తీవ్ర భంగం కలిగిందని కేటీఆర్ కోర్టును కోరారు. ఈ నేపథ్యంలో పరువు నష్టం దావా దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా సురేఖ తరపు న్యాయవాది పలు అభ్యంతరాలు లేవనెత్తినప్పటికీ, కోర్టు వాటిని పరిగణనలోకి తీసుకోకుండా తోసిపుచ్చింది.

కేటీఆర్ తరఫున న్యాయవాది సిద్ధార్థ్ పోగుల వినిపించిన వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, కొండా సురేఖ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేసింది. 21వ తేదీలోపు క్రిమినల్ కేసు నమోదు చేసి, నోటీసులు జారీ చేయాలని కోర్టు స్పష్టం చేసింది.

నాంపల్లి కోర్టు ఆదేశాలపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఈ కేసుకు సంబంధించి కాగ్నిజెన్స్ తీసుకుని ముందుకు వెళ్లాలని నాంపల్లి కోర్టు స్పష్టం చేసిందని అన్నారు. ఈ దేశ న్యాయ వ్యవస్థపై తనకు అపారమైన గౌరవం ఉందని పేర్కొన్నారు. కేసులు, కొట్లాటలు తనకు కొత్తేమీ కాదని అన్నారు. తన జీవితమే ఒక పోరాటమని, ఏ కేసులోనైనా కోర్టు కాగ్నిజెన్స్ తీసుకోమని చెప్పడం సర్వసాధారణమే అని ఆమె అన్నారు. ఇది జరిగి రెండు రోజులయిందని, కానీ కొన్ని ఛానల్స్ తన కేసులో 'సంచలనం.. బిగ్ బ్రేకింగ్..' అంటూ వార్తలు రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కొందరి ఉత్సాహం చూస్తుంటే తనకు చాలా ఆశ్చర్యంగా ఉందని ఆమె అన్నారు. కొండా సురేఖ అనే పేరు వినగానే కొంతమంది రిపోర్టర్లు తన కేసులో కోర్టు తీర్పు ఇచ్చిందని మీడియా, సోషల్ మీడియాల్లో రాస్తున్నారని ఆమె అన్నారు. ఇది వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. అయితే చట్టం తన పని తాను చేసుకుని పోతుందని ఆమె పేర్కొన్నారు.

## అర్ధశతకం సాధించిన సీఎం రేవంత్‌రెడ్డి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఘాటుగా స్పందించారు. ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్టు చేస్తూ 1 నుంచి 50 వరకు అంకెలు పేర్కొంటూ, "ఇవి కేవలం సంఖ్యలు కావు... సీఎం ఢిల్లీ పర్యటనల సంఖ్య" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. "20 నెలల కాలంలో 50 సార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్‌రెడ్డి, అర్ధశతకం సాధించారు. కానీ రాష్ట్రానికి ప్రయోజనం ఏమీ లేదు. ఉత్త మాటలు తప్పితే ఇంకేం మిగలలేదు" అని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఈ చర్యలన్నింటినీ గమనిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. "తెలంగాణకు పాలించే సీఎం కావాలి కానీ, టూరిస్టు సీఎం అవసరం లేదు. ప్రజల కోరికలు తీర్చే నాయకత్వం కావాలి... తప్ప అనవసర యాత్రలు చేయడమేం కాదు" అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు.

## సిరిసిల్ల చేనేత మహిళకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు

- రాష్ట్రంలోనే అవార్డుకు ఎంపికైన తొలి చేనేత కార్మికురాలు
- రాజన్న సిరిపట్టు పీతాంబరానికి దక్కిన గౌరవం
- 45 రోజుల పాటు శ్రమించి చేనేత అద్భుతాన్ని సృష్టించిన రేఖ



**బలగం టీవీ, సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చేనేత మహిళ కళాకారురాలు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపికయ్యారు. చేనేత రంగంలో అత్యంత ప్రతిష్టాత్మక మైనదిగా భావించే కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వెల్ది రేఖను ఎంపిక చేశారు. ఈ అవార్డుకు ఎంపికైన తొలి మహిళా చేనేత కార్మికురాలు వెల్ది రేఖ నే కావడం విశేషం. చేనేత రంగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేసిన ప్రముఖ చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ సతీమణి రేఖ చేనేత మగ్గంపై సృష్టించిన రాజన్న సిరిపట్టు పట్టు పీతాంబరానికి ఈ అరుదైన గౌరవం దక్కింది. 45 రోజులపాటు శ్రమించి చేనేత మగ్గంపై రూపొందించిన పట్టుచీరను అధికారులు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపిక చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఖ్యాతిని తెలియజేప్పేలా చేనేత దంపతులు హరిప్రసాద్, రేఖ లు ఈ పట్టు పీతాంబరాన్ని నేశారు. 48 ఇంచుల వెడల్పు ,అయిదు మీటర్ల పొడవుతో కూడిన ఈ పట్టు చీరలో కాకతీయుల శౌర్యానికి గుర్తు అయిన కమాన్ తో పాటు వేములవాడ రాజన్న కోడె మొక్కులను సూచించే జరీబుటాలను పొందుపరిచారు. సిరిసిల్ల చేనేత పనితనానికి గుర్తుగా నూలు పడుతున్న మహిళ బొమ్మతో కూడిన జరీబుటాను పట్టుచీరపై నేసి అబ్బురపరిచారు. సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారులైన వెల్ది హరిప్రసాద్, రేఖ దంపతులు గత దశాబ్ద కాలంగా చేనేత రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్నారు. నేత పరిశ్రమకు కేంద్రమైన సిరిసిల్ల ఖ్యాతిని ఇనుమడించేలా రాజన్న సిరిపట్టు చీరను రూపొందించారు. అంతేకాక చేనేత రంగంలో కనీ వినీ ఎరగని రీతిలో అగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీర, దబ్బనంలో దూరే పట్టుచీరతో పాటు జి 20 లోగోను మగ్గంపైనేసి సాక్షాత్ దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసలు సైతం అందుకున్నారు. ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా జరిగిన మిస్ వరల్డ్ పోటీలలో సైతం చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ తన ప్రతిభను ప్రదర్శించారు. హరిప్రసాద్ నేసిన చేనేత కళారూపాలను చూసి దేశ విదేశాలకు చెందిన సుందరీమణులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పోటీల సందర్భంగా జరిగిన ప్రదర్శనలో సైతం హరిప్రసాద్ వేసిన పలు పట్టుచీరలను వస్త్రాలుగా కుట్టి మిస్ వరల్డ్ పోటీ దారులు రాంప్ వాక్ చేశారు. అనుక్షణం చేనేత రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్న హరి ప్రసాద్ దంపతులను కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు కు ఎంపిక కావడం పట్ల పలువురు అభినందిస్తున్నారు.

## పబ్లిక్ - ప్రైవేటు భాగస్వామ్యంతో క్రీడాపాలసీ

- ఒలంపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ పాలసీ రూపకల్పన
- క్రీడాభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం
- తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్‌లో సీఎం రేవంత్ రెడ్డి




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

క్రీడల్లో తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా నిలపాలన్న సంకల్పంతో క్రీడా విధానం తెచ్చామని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు చెప్పారు. ఈ విధానంలో రాజకీయ జోక్యం తగ్గించాలన్న ఉద్దేశంతోనే పబ్లిక్ - ప్రైవేటు భాగస్వామ్యంతో క్రీడాపాలసీని రూపొందించామని తెలిపారు. క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తూ అత్యుత్తమ ఫలితాలను అందిస్తున్న కార్పొరేట్ సంస్థలు, ఆ రంగంలో విశేష అనుభవం ఉన్న వారిని ఆహ్వానించే ఒక బోర్డును ఏర్పాటు చేసినట్టు చెప్పారు. హెచ్ఐసీసీలో నిర్వహించిన మొదటి ఎడిషన్ తెలంగాణ క్రీడా సదస్సు లో ముఖ్యమంత్రి గారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ క్రీడా విధానాన్ని ప్రకటించారు. దేశంలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులు, ప్రముఖ క్రీడాకారులు, క్రీడాభిమానులు ఈ కాంక్లేవ్ లో పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "రానున్న రోజుల్లో మంచి క్రీడాకారులను తయారు చేయాలన్న లక్ష్యంతో ఈ పాలసీ తెచ్చాం. ఒక రోజు సదస్సు నిర్వహించి వదిలేయడానికి కాదు. వచ్చే రోజుల్లో ఈ దేశాన్ని ముందుకు నడిపించడానికి, ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలి. ఈ వేదికలో పాల్గొన్న క్రీడాకారులంతా తెలంగాణ క్రీడా పాలసీలో భాగస్వాములే. క్రీడల్లో తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా నిలపాలి. ఇది కొత్త ఆరంభం. ఇందుకు అందరికీ ఆహ్వానం పలుకుతున్నాం. క్రీడాభివృద్ధికి ఎలాంటి మద్దతు కావాలన్నా అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాం. అందరం కలిసి ముందుకు సాగుదాం. తెలంగాణ పేరును ప్రపంచం ముందు నిలపడంలో మీ అందరి మద్దతు ఉండాలి.

నగరాలు, పట్టణాల్లో క్రీడామైదానాలు లేక, క్రీడలను ప్రోత్సహించే పరిస్థితులు లేని కారణంగా కాలేజీలు, విద్యా సంస్థల్లో యువత పెడదారులు పడుతున్నారు. ప్రభుత్వ పరంగా సరైన విధానాలు లేకపోవడం, క్రీడలను ప్రోత్సహిం చని కారణంగానే మాదక ద్రవ్యాలు వేగంగా విస్తరించే ప్రమాదం ఏర్పడుతోంది. మాదక ద్రవ్యాల వినియోగమే కాదు, అవి తెలంగాణలో అడుగు పెట్టాలంటే వణుకు పుట్టాలి. అందుకోసమే ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. 1956 ఒలింపిక్స్ ఫుట్‌బాల్ క్రీడలో 9 మంది క్రీడాకారులు హైదరాబాద్ నుంచి పాల్గొన్న చరిత్ర ఈ ప్రాంతానికి ఉంది. అక్కడి నుంచి ప్రారంభిస్తే ఆ తర్వాత ఎందరో క్రీడాకారులు ఇక్కడి నుంచి రాణించారు. అలా రాణించిన వారికి ప్రభుత్వం ఇంటి స్థలాలు, నగదు ప్రోత్సహకాలు, ఉద్యోగాలు కల్పించడం వంటి అనేక రకాలుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. చదువులోనే కాదు క్రీడల్లో రాణిస్తే క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. గడిచిన పది పదిహేను సంవత్సరాల కాలంలో క్రీడలకు ప్రోత్సహం లేక మైదానాలు ఫంక్షన్ హాళ్లుగా మారాయి.

ఇటీవలి ఒలింపిక్స్‌లో భారత్ 71 వ స్థానంలో ఉందంటే అందరూ ఆలోచించాలి. చిన్న దేశమైన దక్షిణ కొరియా 32 స్వర్ణ పతకాలు సాధిస్తే అందులో ఒక అమ్మాయి ఏకంగా 3 స్వర్ణాలు సాధించారు. 140 కోట్ల జనాభా ఉన్న భారత దేశానికి ఒక్క స్వర్ణం కూడా రాకపోవడం విచారకరం. 2036 ఒలింపిక్స్ నిర్వహించాలని దేశం ముందుకు వెళుతున్న నేపథ్యంలో కనీసం రెండు క్రీడలనైనా తెలంగాణలో నిర్వహించడానికి అవకాశం ఇవ్వాలని కోరాం. దేశం ఒక బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న దశలో క్రీడల్లో కూడా బలంగా నిలవాలి. అందుకే తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌లో క్రీడాభివృద్ధి లక్ష్యాల కోసం ప్రత్యేక చాప్టర్ పెట్టాం. ఆ లక్ష్య సాధన దిశగానే క్రీడల్లో మంచి ఫలితాలు సాధిస్తున్న వారందరినీ ఈ వేదికపైకి ఆహ్వానించాం.

తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీలను ప్రారంభిస్తున్నాం. ఇక్కడ శిక్షణ ఇచ్చే కోచ్‌ల సంఖ్య తక్కువగా ఉంది. అందుకే అత్యుత్తమ శిక్షణ కోసం దక్షిణ కొరియా యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నాం" అని ముఖ్యమంత్రి గారు వివరించారు. ఈ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి సమక్షంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ క్రీడాభివృద్ధికి సంబంధించి పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఈ సందర్భంగా ప్రోత్సాహకంగా ప్రభుత్వం నగదు బహుమతులను అందజేసింది.

కొరియాలో జరిగిన ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 2025 లో స్వర్ణ పతకం సాధించిన అథ్లెట్ అగసర నందినికి 5 లక్షలు, బెల్జియం లో జరిగిన 14 వ అంతర్జాతీయ జిమ్నొవా కప్ 2024 లో కాంస్య పతకం సాధించిన నిశికా అగర్వాల్‌కు 3 లక్షలు, 2024 జర్మనీలో జరిగిన ప్రపంచ (మూగ) షుటింగ్ చాంపియన్ షిప్‌లో 2 స్వర్ణాలు సాధించిన షుటర్ ధనుష్ శ్రీకాంత్‌కు 10 లక్షలు, ఈజిప్ట్‌లో వచ్చే సెప్టెంబర్ లో జరగబోయే గోల్ బాల్ అథ్లెటిక్స్‌లో పాల్గొంటున్న పవన్ కల్యాణ్, పి. సాయి తేజ, కోచ్ శివకుమార్‌లకు 4.8 లక్షల రూపాయలను క్రీడా ప్రోత్సాహకం కింద అందజేశారు.

?? క్రీడలను ప్రోత్సహించడానికి గగన్ నారంగ్ (షుటింగ్), అభినవ్ బింద్రా (స్పోర్ట్స్ సైన్స్), పుల్లెల గోపీచంద్ (బాడ్మింటన్), ఫీఫా, ఒలంపిక్ వ్యాల్యూస్ ఎడ్యుకేషన్, గన్ ఫర్ గ్లోరీ, స్పోర్ట్స్ ప్రిక్స్, ఆస్పైర్, టెన్విక్ లాంటి సంస్థలతో ఒప్పందాలు కుదిరాయి.

?? ఈ కాంక్లేవ్ మంత్రి వాకిటి శ్రీహరి గారు, ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు) ఏపీ జితేందర్ రెడ్డి గారు, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేనారెడ్డి గారు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ గారితో పాటు క్రీడారంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

## సింగరేణిలో విషాదం: గనిలో ప్రమాదం, కార్మికుడు మృతి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిలో శుక్రవారం చోటుచేసుకున్న ప్రమాదంలో సింగరేణి కార్మికుడు రాచపల్లి శ్రావణ్ కుమార్ (శ్రీనివాస్ నగర్, రామకృష్ణాపూర్) దుర్మరణం చెందాడు. గనిలో ఎస్టీల్ యాక్టింగ్‌గా పని చేస్తున్న శ్రావణ్ కుమార్ కు ఎస్డీఎల్ యంత్రం వెనుకభాగం తగలడంతో, పక్కనే ఉన్న లాడీస్ మధ్యలో ఇరుక్కుపోయినట్లు తోటి కార్మికులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న గని అధికారులు శ్రావణ్‌ను వెంటనే రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి రిఫర్ చేసినా, మార్గమధ్యంలోనే శ్రావణ్ మృతి చెందారు అని కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఐవీఎఫ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

- మంత్రి దామోదర్ రాజనర్సింహ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మాతృత్వం కోసం తపిస్తున్న దంపతుల ఆశలను ఆసరాగా చేసుకుని ఐవీఎఫ్, సరోగసీ ప్రక్రియలను వ్యాపారంగా మలచి దందాకు పాల్పడుతున్న ప్రైవేటు ఐవీఎఫ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఇటీవలి 'సృష్టి' తరహా ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రైవేటు ఐవీఎఫ్ సెంటర్లపై విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని, ఇప్పటివరకు ఆయా సెంటర్లపై నమోదైన కేసుల వివరాలను సేకరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఐవీఎఫ్ సెంటర్ల అనుమతులు, రిజిస్ట్రేషన్ల ప్రామాణికత, గడువు తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించాల్సిందిగా మంత్రి స్పష్టం చేశారు.ఈ మేరకు ఆరోగ్యశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీలో ఆరోగ్యశ్రీ సీఈవో, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ పర్యవేక్షణలో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ ఐవీఎఫ్ సెంటర్లలో తనిఖీలు జరగనున్నాయి. ఈ ప్రక్రియను పది రోజుల్లోపు పూర్తి చేసి తుది నివేదికను అందించాలని మంత్రి కమిటీకి స్పష్టం చేశారు. ప్రజారోగ్యం దృష్ట్యా ఈ చర్యలు ఎంతో కీలకమని అధికారులందరూ చొరవచూపాలని ఆయన హితవు పలికారు.

## రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా చంద్రారెడ్డి


**బలగం టీవీ, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా చంద్రారెడ్డి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ ఓఎస్‌డిగా పనిచేసిన ఆయనను ప్రభుత్వం జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా బదిలీ చేసినట్లు తెలిసింది. గతంలో ఇక్కడ అడిషనల్ కలెక్టర్‌గా పనిచేసిన భూపాల్‌రెడ్డి ఏసిబికి పట్టుబడిన విషయం తెలిసిందే. అప్పటి నుండి ఖాళీగా ఉన్న అడిషనల్ కలెక్టర్ స్థానంలో చంద్రారెడ్డిని ప్రభుత్వం నియమిస్తోంది. త్వరలో ఆయన పదవీ భాద్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

## అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ముక్కిపోయిన బియ్యం, పురుగులతో చేసిన వంటకాలు

- **సంగారెడ్డి జిల్లాలో దారుణం**

**బలగం టీవీ, హైదరాబాద్**



సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం కిచ్చన్నపల్లి గ్రామంలో శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వడ్డిస్తున్న ఆహార నాణ్యతపై ఓ దారుణం బయటపడింది. ముక్కిపోయిన పప్పు, బియ్యంలో తోక పురుగులు, లక్క పురుగులు, అలాగే కాలం చెల్లిన నూనెతో వంటలు చేసి పిల్లలకు వడ్డిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై గత కొన్ని రోజులుగా గ్రామస్థుల నుండి ఫిర్యాదులు వస్తుండడంతో శనివారం కొందరు గ్రామస్తులు స్వయంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. వారు పరిశీలించగా అక్కడ ఇప్పటికే వండిన సాంబార్‌లో పురుగులు తేలుతూ కనిపించాయి. అలాగే బియ్యంలో తోక పురుగులు, లక్క పురుగులు స్పష్టంగా కనిపించాయి. వాడుతున్న ఆయిల్ ప్యాకెట్లను పరిశీలించగా 2022 నాటివిగా, కాలం చెల్లినవిగా గుర్తించారు.

ఈ విషయాన్ని వెంటనే సంబంధిత ప్రాజెక్టు అధికారికి గ్రామస్తులు ఫోన్ ద్వారా తెలియజేశారు. దీంతో సూపర్‌వైజర్ సంగీత ఘటన స్థలానికి చేరుకుని పరిశీలన చేపట్టారు. ఆమె కూడా ముక్కిపోయిన బియ్యం, కాలం చెల్లిన ఆయిల్ ప్యాకెట్లు ఉన్నట్లు నిర్ధారించారు. అంతేకాదు, వండిన సాంబార్‌లో పురుగులు ఉన్నాయని, గర్భిణీలకు పంపిణీ చేస్తున్న గుడ్లు కుళ్లిపోయాయని అక్కడికి వచ్చిన మహిళలు సూపర్‌వైజర్‌కు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ టీచర్, ఆయా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. సూపర్‌వైజర్ సంగీత మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అక్కడ ఉన్న బియ్యం, నూనె, పప్పులను అందరి సమక్షంలో చెత్త కుప్పలో పడేశారు.

## శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు

- **ఇన్‌ఫ్లో 1.88 లక్షల క్యూసెక్కులు**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయానికి 1,88,021 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. జూరాల ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 1,39,132 క్యూసెక్కులు, పవర్ హౌస్ నుంచి 25,843 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 23,043 క్యూసెక్కులు శ్రీశైలానికి చేరుతున్నాయి. ఇన్‌ఫ్లో పెరగడంతో జలాశయం నుంచి 2,69,321 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఇందులో భాగంగా ఏడుగేట్లను పది అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. మరోవైపు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 66,102 క్యూసెక్కులు నీరు దిగువకు తరలిస్తున్నారు. ఇందులో కుడి గట్టు పవర్ హౌస్ ద్వారా 30,787 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు విడుదలవుతున్నాయి.

ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నీటిమట్టం 882.20 అడుగులుగా ఉండగా, పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు. అలాగే, గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 200.1971 టీఎంసీల నీరు నిల్వగా ఉంది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. దిగువ ప్రాంతాల ప్రజలను హెచ్చరించి తగిన ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## అనిల్ అంబానీపై రూ.3వేల కోట్ల లోన్ ఫ్రాడ్ కేసులో ఈడీ తొలి అరెస్టు

**బలగం టీవీ, హైదరాబాద్**

అనిల్ అంబానీపై రూ.3,000 కోట్ల రుణ మోసం(లోన్ ఫ్రాడ్) కేసులో శనివారం నాడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తొలి అరెస్టు చేసింది. బిస్వాల్ ట్రేడ్‌లింక్ ప్రైవేట్ లిమిటెడ్ (బీటీపీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ పార్థసారథి బిస్వాల్‌ను మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) 2002 నిబంధనల కింద అదుపులోకి తీసుకున్నారు. నకిలీ బ్యాంక్ గ్యారెంటీని సులభతరం చేసినందుకు అనిల్ అంబానీ యాజమాన్యంలోని రిలయన్స్ పవర్ లిమిటెడ్ నుంచి బీటీపీఎల్ రూ.5.4కోట్లు పొందినట్లు ఈడీ వెల్లడించింది. ఈ ఆర్థిక లావాదేవీ, బీటీపీఎల్ మోసపూరిత కార్యకలాపాలను అంబానీ కార్పొరేట్ నెట్‌వర్క్‌తో అనుసంధానించే కీలక అంశమని అధికారులు చెబుతున్నారు. ఈ కేసుకు సంబంధించి అనిల్ అంబానీపై లుకౌట్ నోటీసు జారీ చేసిన ఒక రోజు తర్వాత ఈ అరెస్టు జరిగింది. ముందస్తు అనుమతి లేకుండా అనిల్ అంబానీ భారతదేశం విడిచి వెళ్లడానికి వీలు లేదని ఈడీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ అనిల్ అంబానీ విదేశాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తే, అతన్ని విమానాశ్రయాలు లేదా ఓడరేవులలో అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది.

## వారణాసిలో అభివృద్ధి పనులకు మోడీ శంకుస్థాపన

**బలగం టీవీ,వారణాసి**



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ఉత్తరప్రదేశ్‌లోని వరణాసిని సందర్శించి అభివృద్ధికి మరింత ఊతమిచ్చారు. తన పార్లమెంటరీ నియోజకవర్గమైన వరణాసిలో రూ.2,200 కోట్ల విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని కిసాన్ యోజన 20వ విడత నిధులను విడుదల చేశారు.

**మల్టీసెక్టరల్ అభివృద్ధి ప్రాజెక్టులు**

విద్య, వైద్యం, రవాణా, పర్యాటక రంగాల్లో అనేక ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. వీటిలో ప్రధానంగా స్కూళ్ల అభివృద్ధి, రోడ్ల విస్తరణ, ఆలయాల పునరుద్ధరణ, పర్యాటక వసతుల సమకూర్చడం వంటి అంశాలున్నాయి.

ప్రధాని మోదీ వారణాసి–భదోహి రోడ్, చిటౌని–శూల్ టంకేశ్వర్ రోడ్లను విస్తరించారు. హర్దత్‌పూర్ వద్ద కొత్త రైల్వే ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. లహర్తారా–కోట్వా, దల్మండి, గంగాపురం, బబత్పూర్‌లో నూతన మార్గాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. ఖలిస్పూర్ యార్డ్ వద్ద కూడా ఓవర్‌బ్రిడ్జ పనులకు శ్రీకారం చుట్టారు.

స్మార్ట్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టు, ఎలక్ట్రిక్ అండర్‌గ్రౌండింగ్ పనులకు రూ.880 కోట్లు కేటాయించారు. ఇందుకు సంబంధించిన పనులకు మోదీ శంకుస్థాపన చేశారు.

ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో శుద్ధి, అభివృద్ధి పనులు చేపట్టారు. రామకుండ, మందాకిని, శంకులధార కుండల వద్ద నీటి శుద్ధి, సంరక్షణ పనులు ప్రారంభమయ్యాయి. దుర్గాకుండ, కార్దమేశ్వర మహాదేవ ఆలయం పునరుద్ధరణ, కాలికా ధామంలో అభివృద్ధి పనులు, రంగిల దాస్ కుట్టియాలో తాళాబ్, ఘాట్ సుందరీకరణ వంటి పనులకు శంకుస్థాపన చేశారు.

కంచన్‌పూర్‌లో మియావాకి అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధి, 21 పార్కుల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. నదీ తీరంలోని 8 కచ్చా ఘాట్లను పునరుద్ధరించారు. నాలుగు ఫ్లోటింగ్ పూజా ప్లాట్‌ఫారాలను ఏర్పాటుచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు అందించేందుకు జల జీవన్ మిషన్ కింద 47 గ్రామీణ తాగునీటి పథకాలను ప్రధాని ప్రారంభించారు.

వారణాసిలోని 53 పాఠశాల భవనాల అప్‌గ్రేడ్‌తో పాటు, జఖినీ, లాల్‌పూర్ ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణకు ప్రధాని శంకుస్థాపన చేశారు. కొత్త జిల్లా లైబ్రరీ నిర్మాణం మొదలైంది.

మదన్ మోహన్ మాలవీయ క్యాన్సర్ సెంటర్, హోమీ భాభా క్యాన్సర్ ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీ, సీటీ స్కాన్ వంటి ఆధునిక పరికరాల ఏర్పాటుకు మోదీ శంకుస్థాపన చేశారు. అలాగే హోమియోపథిక్ కాలేజీ, ఆసుపత్రి నిర్మాణానికి బాటలు వేశారు. పశు జనన నియంత్రణ కేంద్రం, కుక్కల సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు.

## సృష్టి కేసులో మరో ముగ్గురు అరెస్ట్

**11కి చేరిన నిందితుల సంఖ్య**

**బలగం టీవీ, హైదరాబాద్**

సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో సంచలన విషయాలు వెలుగుచూస్తున్నాయి. శనివారం మరో ముగ్గురు నిందితులను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. ఇప్పటి వరకు అరెస్టైన నిందితుల సంఖ్య 11కు చేరింది. డాక్టర్ నమ్రత చుట్టూ విస్తృతంగా అల్లుకున్న ఈ మాఫియా బృందంలో మహిళలే ప్రధానంగా ఏజెంట్లుగా పనిచేసినట్లు అధికారులు తెలిపారు.

ఏ3 విశాఖ సృష్టి కేంద్రం మేనేజర్ కల్యాణి, ఏ6 ధనశ్రీ సంతోషి(అస్సాం)ను కస్టడీలోకి తీసుకున్నారు. ఇద్దరిని 5 రోజులపాటు కస్టడీకి సికింద్రాబాద్ సివిల్ కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. వీరిని సరోగసీ వ్యవహారంలో పోలీసులు మరింత లోతుగా విచారించనున్నారు. ఈ ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గాంధీ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయానికి తరలించారు. పూర్తిస్థాయిలో విచారణ అనంతరం, నిందితులు చెప్పిన విషయాలను బట్టీ ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశాలున్నాయి.


సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. సృష్టి ఫెర్టిలీటీ సెంటర్‌లో సరోగసీ పేరుతో పలువురు దంపతులను మోసం చేసి పెద్దఎత్తున డబ్బులు దండుకున్నారు. అస్సాంకు చెందిన మహిళలు ధనశ్రీ, సంతోషి ద్వారా పేద దంపతుల వద్ద పిల్లలను కొనుగోలు చేయడం, కావాల్సిన దంపతులకు(ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న) వారి బిడ్డగా అప్పగించేవారు. మరోవైపు నింబధనలకు విరుద్ధంగా వీర్యం, అండాలను సేకరించి ఇతర రాష్ట్రాల్లో విక్రయించారు. సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ కేసులో సంతోషి కీలకంగా వ్యవహరించినట్టు, సంతోషి మాటలను నమ్మిన బాధితులు భారీగా మోసపోయినట్టు పోలీసులు గుర్తించారు. సంతోషి, నమ్రతలు చైల్డ్ ట్రాఫికింగ్‌కి పాల్పడ్డారన్న కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టారు.

తెలుగు రాష్ట్రాలతోపాటు మరో నాలుగు రాష్ట్రాల్లో డాక్టర్ నమ్రత భారీ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుందని పోలీసులు గుర్తించారు. ఎవరికీ అనుమానం రాకుండా, సులువుగా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకోవాలన్న ఉద్దేశంతో పెద్దఎత్తున మహిళా ఏజెంట్లను ఏర్పాటు చేసుకుందని తెలిసింది. శిశవుల క్రయ విక్రయాల్లో నమ్రతకు ఏజెంట్లు సహకరించడంతో వారందరికి భారీగా నజరానాలు ఇచ్చారని పోలీసులు గుర్తించారు. గ్రామీణ ప్రాంతాలే టార్గెట్‌గా మెడికల్ క్యాంపులు, ఉచితంగా ఫెర్టిలిటీ సేవలు చేస్తానని క్యాంపుల నిర్వహించినట్టు తెలిసింది. క్యాంపులకు వచ్చిన దంపతులకు పిల్లలు కలుగుతారంటూ డాక్టర్ నమ్రత నమ్మించేంది. ఐవీఎఫ్ బదులు సరోగసీకి రెఫర్ చేసి సరోగసీ కోసం దంపతుల నుంచి రూ. 30 నుంచి రూ. 50 లక్షలు వసూలు చేశారని సమాచారం. దంపతులను నమ్మించేందుకు సంతోషిని తోపాటు ఇతర ఏజెంట్ల ద్వారా పిల్లలను కొనుగోలు చేసి సరోగసీ ద్వారా పుట్టారంటూ దంపతులకు డాక్టర్ నమ్రత అందించి అదనపు డబ్బులు లాగేదని విశ్వసనీయ సమాచారం. ఇదిలావుండగా పోలీసుల విచారణలో మాత్రం నమ్రత నోరువిప్పడం లేదని తెలిసింది. విచారణలో అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా గుర్తులేవని చెపుతున్నట్టు సమాచారం.

ఈ మాఫియా ద్వారా సంపాదించిన డబ్బులతో హైదరాబాద్, ఏపీలో డాక్టర్ నమ్రత ఫామ్‌హౌస్‌లు, భవన సముదాయాలను కొనుగోలు చేసినట్లు తెలిసింది. కేసులో ఏ3 కల్యాణి, ఏ6 సంతోషిల పాత్ర కీలకమని పోలీసులు చెప్పారు. వీరిద్దరూ ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో కలిసి కొత్త శిశువులను తల్లుల వద్ద నుంచి తీసుకొచ్చి డాక్టర్ నమ్రత మాఫియాకు అందజేసే పనిలో ఉన్నట్లు సమాచారం.

## రాహుల్ 'అణుబాంబు' వ్యాఖ్యలపై రాజ్‌నాథ్ కౌంటర్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



ఓటర్ల జాబితాలపై 'అణుబాంబు' పేలుస్తామని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. "రాహుల్ గాంధీ బాంబు ఉందంటున్నారు, అయితే వెంటనే పేల్చాలి" అంటూ ఎద్దేవా చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు కొత్తకావని గుర్తు చేసిన రాజ్‌నాథ్... "ముందూ భూకంపం వస్తుందని హెచ్చరించారు, కానీ చివరికి తుస్సుమని పేలింది" అని వ్యాఖ్యానించారు. రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘంపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యంగా ఉంటుందని ఆయన విమర్శించారు.

రాహుల్‌గాంధీ దగ్గర ఆటమ్ బాంబు ఉంటే పేల్చనిద్దామని, కానీ ఆ పేలుడులో ఎలాంటి హాని జరగకుండా ఆయనను ఆయన కాపాడుకోవాలని రక్షణ మంత్రి ఎద్దేవా చేశారు. అధికార బీజేపీ కోసం ఈసీ ఓట్ల చౌర్యానికి పాల్పడుతుందంటున్న రాహుల్‌గాంధీ తన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని రక్షణ మంత్రి హెచ్చరించారు. లేదంటే నిప్పుతో ఆడుకోవడమైనా ఆపాలని వార్నింగ్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ చేతికి ఎమర్జెన్సీ రక్తపు మరకలు ఉన్నాయని రాహుల్‌గాంధీ గుర్తుపెట్టుకోవాలని, వైరిపక్షాలపై నోటికొచ్చిన ఆరోపణలు మానుకోవాలని రాజ్‌నాథ్ హితవుపలికారు.

# ప్రశ్నించే గడ్డపైనే...ప్రశ్నించే గొంతు నొక్కడమా..




(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అందోళనలకు దిగుతామని తెలిపారు.

**కలిసి కట్టుగా పోరాటం చేయాలి : మహిళ సంఘం నాయకులు గుడెం సావిత్రి**

చిన్న చిన్న ఉద్యోగాల్లో ఎక్కువగా దళితులే ఉంటారని, వారిపై అగ్రకుల నాయకులు ఇబ్బందుల గురి చేస్తున్నారని అన్నారు. దళిత గిరిజనులపై దాడులు చేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు ధైర్యంగా ఉండి, కలిసి కట్టుగా పోరాటం చేయాలని అన్నారు. బిఎన్ఎస్ 163 యాక్ట్ నోటిసు రద్దు చేయాలని అన్నారు.

**వ్యక్తిగత కక్షలతో కుటుంబజోలికి వెళ్లడం దారుణం - బీఎస్పీ రాష్ట్ర నాయకులు చాకలి రమేష్**

కొన్ని 1000 సంవత్సరాల నుండి దళితులపై వివక్ష కొనసాగుతుందని, ఆనాటి తెల్ల దొరల నుండి నేటి దొరల వరకు దాడులు జరుగుతున్నది మన దళితులపైనేనని అన్నారు.మనలో ఐక్యత లేకపోకనే ఈ దాడులు జరుగుతున్నాయని అన్నారు. తప్పు చేస్తే న్యాయవ్యవస్థ ద్వారా శిక్ష వేయాలని, వ్యక్తిగత కక్షలతో కుటుంబజోలికి వెళ్లడం దారుణం అని అన్నారు. బి ఎన్ ఎస్ 163 యాక్ట్ నోటిసు ని ఎక్కడ ఉపయోగించలేదని, కావాలని సిరిసిల్ల లో బాలు కాయి తిపై విధించి రాజ్యాంగన్ని దుర్వినియోగా పరుస్తున్నారని అన్నారు. కొడుకు అనారోగ్యం ఉన్నా కూడా బాలు కాయితి సతీమణిని కావాలని బదిలీ చేసిందని, అంతటితో ఆగకుండా ఇంటి మీదికి వెళ్లి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేయడం దారుణం అని అన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా దళితులు అంతా ఐక్యత ఉండాలని, వెంటనే బి ఎన్ ఎస్ 163 ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రజల తరపున ప్రశ్నించే వ్యక్తి బాలు.. గిరిజన లంబాడి జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్**

బాలు కాయితి బీఎన్ ఎస్ 163 యాక్ట్ నోటిసు ఇవ్వడం సమంజసం కాదు అని అన్నారు. ప్రజల తరపున ప్రశ్నించే వ్యక్తి బాలు అని ఆయన గొంతు గొంతు పై ఉక్కు పాదం మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అదేవిధంగా జిల్లాలోని గిరిజన ఉన్నత అధికారిని మనోవేదనకు గురి చేయడం సరికాదు అని ,అన్ని ప్రజలు గమనిస్తున్నారని, బాలు కాయితి పై బిఎన్ఎస్ 163 యాక్ట్ ని ఎత్తి ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

**భావ స్వేచ్ఛను కాల రాయడమే : బార్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, సీనియర్ అడ్వకేట్ తంగళ్ళపల్లి వెంకటి**

చట్టం కింద అందరూ పనిచేస్తారని, బలగం టీవీలో వీడియోస్ అన్ని చట్టానికి లోబడి ఉన్నాయని, ఒక జర్నలిస్టుగా తప్పు చేసే వారిని ప్రశ్నించే హక్కు ఉంటుందని అన్నారు. బాలుపై బిఎన్ఎస్ 163 యాక్ట్ నోటీసు ఇచ్చి బావ స్వేచ్ఛను కాల రాయడమేనని అన్నారు. నేను చేసింది తప్పు మీరు నన్ను ప్రశ్నించవద్దు అని బి ఎన్ ఎస్ 163 యాక్ట్ నోటిసు ఇచ్చినట్టు ఉన్నదని అన్నారు. దళిత వ్యక్తిని, ఒక సీనియర్ జర్నలిస్ట్ స్వేచ్ఛను కాలరాయడానికి ఇచ్చిన నోటీసును వెనుకకు తీసుకోవాలని, ఈ నోటీసు వల్ల ప్రభుత్వం పరువు పోతుందని అన్నారు. ఏ విధంగా బి ఎన్ ఎస్ 163 యాక్ట్ నోటిసు ఇచ్చారో,మీరు ప్రభుత్వానుసారం నడిచినట్ల యితే నోటు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**తప్పు ఎక్కడ జరిగిన ప్రశ్నించే తత్వం బాలుది : జర్నలిస్ట్ కిషోర్**

బాలు కాయితి సోషల్ మీడియాలో ఎంతోమందికి సాయం చేశాడని అన్నారు. ప్రశ్నించే వారు బాలు అని, తప్పు ఎక్కడ జరిగిన ప్రశ్నించే తత్వం బాలుదని,బి ఎన్ ఎస్ 163 యాక్ట్ నోటీస్ తో బాలు గొంతు పై ఉక్కు పాదం మోపడం సరిహద్దు కాదు అని అన్నారు. ప్రశ్నించే గొంతుకులను కాపాడుకోవలసిన బాధ్యత మన దళితులపై ఉన్నదని అన్నారు.

**దళితుల పై ప్రభుత్వం ఉక్కు పాదం**

మాల మహానాడు జిల్లా కార్యదర్శి నీరటి శ్రీనివాస్ మాట్లాడుతూ దళిత ఉద్యమకారులపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతోందని, ఐక్యంగా ఉండి మనమందరం ముందుకు పోతే ఈ దాడులు జరగవు అని అన్నారు. ఏ ద్రోహం చేశాడని బాలు కాయితి పై బిఎన్ఎస్ 163 యాక్ట్ పెట్టడం సరికాదు అని దీని ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని అన్నారు.

**సిరిసిల్లలో బిఎన్ఎస్ 163 యాక్ట్ విధించడం దారుణం : ప్రజా సంఘాల నాయకుడు అరుణ్ కుమార్**

చైతన్యవంతమైన సిరిసిల్ల గడ్డలో ఇలాంటిది జరగడం దారుణమని, అధికారులు చరిత్ర తెలుసుకోవాలని, ప్రశ్నించే గడ్డపై ప్రశ్నించవద్దు అని నిబంధన తీసుకురావడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ చట్టంలో జమ్మూ కాశ్మీర్ లాంటి రాష్ట్రంలో ఉపయోగిస్తారని, కానీ సిరిసిల్లలో విధించడం దారుణమని అన్నారు. బాలు కాయితి కక్ష పూర్వకంగానే బదిలీ చేయడం, అధికార యంత్రాంగాన్ని ప్రశ్నిస్తే కుట్రలు పన్నుతున్నారని, జర్నలిస్ట్ కే ఇలా జరుగుతే మన గురించి ఎవరు ప్రశ్నిస్తారని, బాలు కాయితికి అందరం ఐక్యంగా , అండగాగా నిలవాలని అన్నారు. ఆ నోటీసును రద్దు చేయాలని అన్నారు.

**బీహార్ సంస్కృతి సిరిసిల్లలో అమలుపరుస్తుండ్రు -మాజీ సర్పంచ్ కొమ్ము బాలయ్య**

అధికారులు ఇలాంటి దాడులు చేయడం దుర్మార్గమని అన్నారు, రాజ్యాంగ బద్దమైన పదివిలో ఉండి, రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. బీహార్ రాష్ట్రంలో దళిత వర్గాలపై దాడులు జరుగుతాయని, అక్కడి సంస్కృతి సిరిసిల్లలో అమలుపరుస్తున్నారని అన్నారు. వెంటనే బిఎన్ఎస్ 163 యాక్ట్ నోటీసును వెనుకకు తీసుకోవాలని అన్నారు.

**బాలు కాయితి ని అణగదొక్కే ప్రయత్నం చేయవద్దు-బాబ్జి ,సీనియర్ జర్నలిస్టు**

బాలు కాయతి సోషల్ మీడియాలో ద్వారా ఎంతో మందికి సాయం చేశాడని అలాంటి జర్నలిస్టుపై బిఎన్ఎస్ 163 యాక్ట్ నోటీసు ఇచ్చి గొంతు నొక్కడం సరికాదు అని అన్నారు. దళితుల్లో గొప్ప స్థాయికి బాలు కాయితి వెళ్ళాడని, అలా దళితుల్లో మనమందరం వారిలాగా ఎదగాలని, ఎదిగిన వారిని అణగదొక్కే ప్రయత్నం చేయవద్దని, వెంటనే ఆ నోటీసును వెనుక తీసుకోవాలని అన్నారు.

**ప్రశ్నించే వారిపై ఉక్కు పాదం మోపడం సరికాదు -బీసీ ఉద్యమకారుడు జక్కుల నాగరాజు**

బాలు కాయితి పై బిఎన్ఎస్ 163 యాక్ట్ నోటీస్ ఇవ్వడం ద్వారా జర్నలిస్టుల గొంతును నొక్కుతున్నారని, ఈ నోటీసు ఇవ్వడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సమాజం సిరిసిల్ల వైపు చూస్తుందని అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం ప్రశ్నించే వారిపై ఉక్కు పాదం మోపడం సరికాదు అని అన్నారు.

గాయకుడు గజ్జల అశోక్ మాట్లాడుతూ బిఎన్ఎస్ 163 యాక్ట్ నోటీస్ ఇవ్వడం తప్పు అని, బలగం టీవీ ద్వారా ఎంతోమంది కళాకారులను రచయితలను కాయితి బాలు వెలుగు లోకి తెచ్చారని అన్నారు. బిఎన్ఎస్ 163 యాక్ట్ నోటిసు ఎత్తివేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని, దీనిపై త్వరలో ఆందోళన నిర్వహిస్తామని అన్నారు.

మాల మహానాడు రాష్ట్ర నాయకులు జక్కుల రామచంద్రం మాట్లాడుతూ బాలు కాయతిపై 163 యాక్ట్ నోటీసు ఇవ్వడం దుర్మార్గమైన చర్యాని, దీనిని ఎత్తివేయాలని లేకపోతే ఆందోళన నిర్వహిస్తామని అన్నారు

## రూ. 4 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించిన రాష్ట్ర ప్రభుత్వ విప్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

వేములవాడ నియోజకవర్గ పరిధిలోని వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన చందనం రాములుకు అనారోగ్య సమస్యల వలన అత్యవసర చికిత్స అవసరం ఉన్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి తెలియజేయగానే తక్షణమే స్పందించి నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చలు జరిపి ప్రత్యేకమైన చికిత్స అందించవలసిందిగా ఆదేశిస్తూ మరియు ప్రభుత్వం నుండి 4 లక్షల రూపాయలను ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు డబ్బులను మంజూరు చేయించారు. కాగ ఎల్ఓసి మంజూరు చేపించడం పట్ల బాధిత కుటుంబ సభ్యుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## యూరియా అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రుద్రంగి పరిధిలోని మానాల క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ని ఎస్.ఐ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ.. యూరియా అక్రమంగా దాచిపెట్టినా రవాణా చేసినా, బ్లాక్ మార్కెటింగ్ చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వ్యవసాయ అధికారులు సూచించిన దాని ప్రకారం రైతులు యూరియా వాడుకోవాలని సూచించారు. ఎవరైనా అక్రమంగా యూరియా దాచిపెట్టిన వ్యవసాయేతర పనులకు యూరియా వాడిన ఇలాంటి సమాచారం ఉంటే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ సమాచారం అందించాలని సూచించారు.

## క్రిమిసంహారక మందు తాగి వివాహిత ఆత్మహత్య

**బలగం టీవీ, బోయినిపల్లి:**



రేగులపల్లి-మల్లాపూర్ గ్రామానికి చెందిన వట్టి అనూష (20) అనే వివాహిత క్రిమిసంహారక మందు తాగి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించింది.

వివరాల్లోకి వెళ్తే అనూషకు కొక్కేరకుంట గ్రామానికి చెందిన ఆమె మేన బావ వేముల బిట్టుతో వివాహమైంది. పెళ్లి తర్వాత ఆమె భర్త, అత్తమామలతో కొక్కేరకుంట గ్రామంలో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా వేరే కాపురం పెట్టాలని అనూష కోరగా, కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. ఈ మనస్తాపంతో ఆమె తన తల్లి ఇంటికి రేగులపల్లి గ్రామానికి వెళ్లింది. ఈ క్రమంలోనే, జూలై 23, 2025న అనూష గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే హాస్పిటల్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆగస్టు 1, 2025న మరణించింది. అనూష తండ్రి వట్టి అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోయినిపల్లి ఎస్.ఐ. రాజకుమార్ తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన..

### ఏఎన్ఎం వసంత

**బలగం టీవీ, బోయినిపల్లి**



తడగొండ గ్రామంలో శుక్రవారం రోజున సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఏఎన్ఎం వసంత తెలిపారు. వసంత మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించమని, సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి వ్యాధుల లక్షణాలు, వ్యాప్తి, నివారణ మార్గాల గురించి అవగాహన,వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు, నీటిని శుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై సూచనలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు అనసూయ, సునీత తదితరులు పాల్గొన్నారు.



## ఆంగ్ల టీచర్ అశోక్ రెడ్డికి ఆత్మీయ వీడ్కోలు..

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసిన ఇంగ్లిష్ టీచర్ ఎడవెల్లి అశోకరెడ్డి పదవి విరమణ సందర్భంగా ఉపాధ్యాయబృందం-విద్యార్థులు ఘనంగా సన్మానం చేసారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోను భూమయ్య మాట్లాడుతూ.. అశోక్ రెడ్డి వృత్తి నిబద్ధత ఎందరికో ఆదర్శం, ఆయన బోధన విధానం సమయపాలన పాఠశాల పట్ల అంకితభావం చాలా అభినందనియం తన నడవడిక ఎందరికో మార్గం అని తెలిపారు.

మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, అశోక్ రెడ్డి ఆంగ్లపరిజ్ఞాన సేవలు అద్భుతమని తను శేష జీవితం ఆయురారోగ్యాలతో అష్టఐశ్వర్యంతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షులు గసికంటి శ్రీనివాస్, మండల తహశీల్దార్ నారాయణరెడ్డి,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బొలుగం శ్రీనివాస్, ఉషారాణి, ప్రధానోపాధ్యాయులు జలందర్, నరోత్తమరెడ్డి, కనుకయ్య, శ్రీధర్ సీఆర్పీలు శ్రీనివాస్, తిరుపతి, మమత మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం, పేరెంట్స్ విద్యార్థులు తను 30సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తిలో తనతో పని చేసిన వారందరు, బందు మిత్రులు పాల్గొన్నారు.

## సింగారంలో ఎంపీ నిధులతో బోరు ప్రారంభం..

- **గ్రామస్తులకు తీరనున్న నీటి కష్టాలు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడానికి పార్లమెంట్ సభ్యులు మరియు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముందుకు వచ్చారు. గ్రామస్తుల వినతి మేరకు, ఆయన తన ఎంపీ నిధుల నుండి వెంటనే బోరు మంజూరు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డ బోయిన గోపి హాజరై కొబ్బరికాయ కొట్టి బోర్వెల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ బోరు ఏర్పాటుతో సింగారం గ్రామ ప్రజల దశాబ్దాల నాటి నీటి కష్టాలు తీరనున్నాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు రేపాక రామచంద్రం రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ పొన్నాల తిరుపతిరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రాగుల రాజు రెడ్డి, జిల్లా కార్యదర్శి బందారపు లక్ష్మారెడ్డి, ముస్తాబాద్ మండల అధ్యక్షులు సౌల క్రాంతి కుమార్, మండల్ ప్రధాన కార్యదర్శి దాసరి గణేష్, నంది నరేష్, గ్రామ మాజీ సర్పంచ్ మంగోలి నరసయ్య, శ్రీనివాస్ గౌడ్, వంతడుపుల సుధాకర్, తిరుపతి బాలా గౌడ్, ఉడుగుల యాదగిరి, ప్రదీప్ రెడ్డి, కుమార్, వంగల రాజు, దయాకర్, దిలీప్, సిరిసిల్ల వంశీ చరణ్ గౌడ్, తిరుపతి, అలాగే పలువురు బీజేపీ సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీమిండియాకు 35 రోజుల సెలవు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంగ్లండ్ పర్యటన చివరి దశకు చేరిన నేపథ్యంలో టీమిండియాకు తాత్కాలికంగా విశ్రాంతి సమయం లభించనుంది. ఓవల్ వేదికగా జరుగుతున్న ఐదో టెస్ట్ మ్యాచ్ సోమవారం ముగియాల్సి ఉంది. ఈ ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో ప్రస్తుతం ఇంగ్లండ్ 2-1 ఆధిక్యంలో ఉంది. చివరి టెస్ట్‌లో టీమిండియా విజయం సాధిస్తే సిరీస్‌ను 2-2తో సమం చేయనుంది. ఓడితే 3-1తో ఇంగ్లండ్ సిరీస్‌ను గెలుచుకుంటుంది. డ్రా అయినా టైటిల్ ఆతిథ్య జట్టుకే దక్కుతుంది. ఈ సిరీస్ అనంతరం బంగ్లాదేశ్‌లో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడాల్సి ఉన్నా, అక్కడి పరిస్థితుల కారణంగా పర్యటనను 2026 సెప్టెంబర్‌కు వాయిదా వేశారు. దీంతో టీమిండియాకు ఆసియా కప్ 2025 వరకు ఎలాంటి అంతర్జాతీయ మ్యాచ్‌లు లేవు.

**ఆసియా కప్ 2025 షెడ్యూల్**

సెప్టెంబర్ 9: భారత్ వర్సెస్ యూఏఈ
సెప్టెంబర్ 14: భారత్ వర్సెస్ పాకిస్తాన్
సెప్టెంబర్ 19: భారత్ వర్సెస్ ఓమన్

గ్రూప్ దశలో మూడు మ్యాచ్‌లు ఆడి, భారత్ సూపర్-4కు అర్హత సాధిస్తే మరో మూడు మ్యాచ్‌లు ఆడుతుంది. ఫైనల్ చేరితే తుది పోరులో కూడా పాల్గొననుంది.




# 16 నుంచి పీవీఎల్ స్కూల్ వాలీబాల్ లీగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశంలో మూడవ అతిపెద్ద క్రీడా లీగ్‌గా పేరుగాంచిన ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) తాజాగా ఓ విశేష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తమ ఫ్రాంచైజీ హైదరాబాద్ బ్లాక్ హాక్స్ (హెచ్‌బీహెచ్), వర్సిటీ స్పోర్ట్స్ సంస్థతో కలిసి 'పీవీఎల్-హెచ్‌బీహెచ్ వర్సిటీ స్కూల్ వాలీబాల్ లీగ్' ను ప్రకటించింది. ఈ లీగ్‌ను ప్రారంభిస్తున్నట్టు హెచ్‌బీహెచ్ జట్టు యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి వెల్లడించారు. పాఠశాల స్థాయిలోని యువ క్రీడాకారులకు వేదిక కల్పించడం, వాలీబాల్ పట్ల ఆసక్తి పెంచడమే ఈ లీగ్ లక్ష్యమని తెలిపారు.

ఐదు వారాల పాటు జరగనున్న ఈ లీగ్‌లో 32 బాలుర, 19 బాలికల జట్లు మొత్తం 50 జట్లు బరిలోకి దిగనున్నాయి. ఈనెల 16 నుంచి సెప్టెంబర్ 28 వరకు హైదరాబాద్‌లోని వేదికలపై ఈ లీగ్ నిర్వహించనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో, ప్రొఫెషనల్ స్థాయిలో పోటీలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌బీహెచ్ జట్టు స్టార్ ఆటగాడు గురు ప్రశాంత్ మాట్లాడుతూ, తన స్కూల్ రోజుల్లో ఇలాంటి లీగ్‌లు లేకపోవడంతో మంచి ప్రాక్టీస్‌కు అవకాశాలు దక్కలేదన్నారు. ఇప్పటి తరం విద్యార్థులకు ఈ లీగ్ ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ లీగ్ నిర్వహణకు బైస్కిల్, కైజెన్, సిక్స్5సిక్స్ సంస్థలతో పాటు పీవీఎల్, హెచ్‌బీహెచ్ లు కలిసి సహకరిస్తున్నాయని హైదరాబాద్ బ్లాక్ హాక్స్ స్పోర్ట్స్ డైరెక్టర్ సంజయ్ తెలిపారు. భావి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చిన సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు.




# 'ఓజీ' నుంచి ఫైర్ స్ట్రోమ్ సాంగ్ విడుదల

- **సెప్టెంబర్ 25న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్**
- **థమన్ మ్యూజిక్.. శింబు, రాజా కుమారి వాయిస్ హైలైట్**

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న పాన్-ఇండియా గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'ఓజీ' నుంచి మరో మాస్ ట్రీట్ విడుదలైంది. సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. జపాన్ నేపథ్యంతో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రానికి ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ మరియు గ్లింప్స్ వీడియో మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. ఈ క్రమంలో తాజాగా మేకర్స్ విడుదల చేసిన ఫైర్ స్ట్రోమ్ సాంగ్' ఫ్యాన్స్‌ను మిగితా ప్రేక్షకులను అలరిస్తోంది.

ఈ మాస్ నంబర్‌కు ఎస్. థమన్ మ్యూజిక్ అందించగా, వాయిస్ పరంగా థమన్ ఎస్, నజీరుద్దీన్, భరతరాజ్, సిలంబరసన్ టిఆర్ (శింబు), దీపక్ బ్లూ, రాజా కుమారి కలిసి గానం చేశారు.ఈ పాటలో పవన్ కల్యాణ్ పర్సనాలిటీకి తగ్గట్టు పవర్ ప్యాక్డ్ లిరిక్స్, ఇంటెన్స్ బీట్, హై వోల్టేజ్ పర్ఫార్మెన్స్ ఉండటంతో ఇది సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది.

పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న ఈ సినిమాను డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై దానయ్య నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 25న విడుదలకు సన్నద్ధమవుతున్న ఈ సినిమాతో పవన్ మరోసారి బాక్సాఫీస్‌ను షేక్ చేయడం ఖాయం అని అభిమానులు ఆశిస్తున్నారు.

# ఇంగ్లండ్ లక్ష్యం 374

## భారత్ విజయం కోసం 9 వికెట్లు అవసరం




**బలగం టీవీ, లండన్**

ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదవ మరియు చివరి టెస్ట్‌లో టీమిండియా విజయానికి బలమైన స్థితిలో నిలిచింది. ఓవల్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 396 పరుగుల భారీ స్కోరు చేసి, ఇంగ్లండ్ ముందు 374 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. నాల్గవ రోజు ముగిసేసరికి ఇంగ్లండ్ ఒక వికెట్ నష్టానికి 50 పరుగులు చేసింది. విజయం కోసం భారత్‌కు మరో 9 వికెట్లు అవసరం.

23 పరుగుల వెనుకంజలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు యశస్వి జైస్వాల్ అద్భుత శతకం అందించాడు. 164 బంతుల్లో 14 ఫోర్లు, 2 సిక్సర్లతో 118 పరుగులు చేసి నిలకడగా ఆడాడు. ఆకాష్ దీప్ తన తొలి టెస్ట్ హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. టాప్ ఆర్డర్ బ్యాటర్‌లా 94 బంతుల్లో 12 ఫోర్లతో 66 పరుగులు చేసి మెరిశాడు. రవీంద్ర జడేజా (53), వాషింగ్టన్ సుందర్ (53) కూడా హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. భారత ఇన్నింగ్స్‌లో చివరిదాకా దూకుడుగా ఆడి, సుందర్ మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పడంలో కీలక పాత్ర పోషించాడు.

75/2 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు ఆట ప్రారంభించిన భారత్‌కు నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాష్ దీప్ అద్భుతంగా ఆడి 70 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. జైస్వాల్‌తో కలిసి మూడో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యం అందించాడు. లంచ్ బ్రేక్‌కు ముందు జెమీ ఓవర్టన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు.

ఇంగ్లండ్ బౌలింగ్‌లో జోష్ టంగ్ 5 వికెట్లు (5/125), గస్ అట్కిన్సన్ 3/127, జెమీ ఓవర్టన్ 2/98 తీసుకొని భారత్ ఇన్నింగ్స్‌ను కట్టడి చేయడానికి ప్రయత్నించారు. అయితే భారత బ్యాటర్ల దూకుడు ముందు వారంతా తలవంచక తప్పలేదు.

చివరి రోజు ఆటలో 374 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్, 13.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 50 పరుగులు చేసింది. జాక్ క్రాలీ (14)లిలిను మొహమ్మద్ సిరాజ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. క్రీజులో బెన్ డకెట్ (34 బ్యాటింగ్) ఉన్నాడు. ఇంగ్లండ్‌కు ఇంకా 324 పరుగులు అవసరం కాగా, భారత్‌కు 8 వికెట్లు తీసే అవకాశమే విజయానికి మార్గం. ఆఖరి సెషన్‌లో జడేజా - సుందర్ జోడీ భారత్ స్కోరు మెరుగుపరిచింది.

# 'కూలీ' ట్రైలర్ విడుదల

- **ఫ్యాన్స్‌కు మాస్ ట్రీట్**

**బలగం టీవీ, హైదరాబాద్**

కోలీవుడ్ సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటించిన భారీ పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా 'కూలీ' థియేట్రికల్ ట్రైలర్ విడుదలైంది. స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో రజనీ శక్తిమంతమైన డాన్‌గా కనిపించబోతున్నారు. హార్బర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలోని విజువల్స్ గ్రాండ్‌గా, నేరాల ముసుగులో కనిపించగా.. ఇది పూర్తి స్థాయిలో లోకేష్ శైలిని ప్రతిబింబిస్తోంది. బీడీని తిరగేసే రజనీ స్టైల్, ట్రైలర్ చివర్లో వచ్చే షాట్.. థలైవర్ అభిమానులను అలరించనుంది. అనిరుధ్ రవిచంద్రన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ముఖ్యంగా ట్రైలర్‌లో వినిపించే ఇంగ్లీష్ రాప్ సినిమా టోన్‌కు తగ్గట్టుగా స్పీడ్‌ను పెంచింది. నిర్మాణ విలువలు అత్యున్నతంగా ఉండటంతో ట్రైలర్ విజువల్స్ అత్యద్భుతంగా కనిపిస్తున్నాయి.

'కూలీ' ట్రైలర్‌లో రజనీ మాస్ ఫెరాసియస్ లుక్‌తో ఆకట్టుకుంటే, టాలీవుడ్ హీరో నాగార్జున, బాలీవుడ్ స్టార్ ఆమీర్ ఖాన్, కన్నడ స్టార్ ఉపేంద్ర, మలయాళ నటుడు సౌబిన్ షాహిర్, హీరోయిన్ శ్రుతి హాసన్ కూడా వన్ బై వన్ పరిచయమవుతూ అంచనాలను పెంచారు. అయితే వీరి పాత్రల్ని పూర్తిగా రివీల్ చేయకుండా, డైరెక్టర్ లోకేష్ మిస్టరీని మెయింటెయిన్ చేశారు.

**బాక్సాఫీస్ దగ్గర భారీ పోటీ**


ఆగస్ట్ 14న, స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా 'కూలీ' గ్లోబల్‌గా విడుదల కానుంది. ఇదే రోజున హృతిక్ రోషన్ - ఎన్టీఆర్ మల్టీస్టారర్ 'వార్ 2' కూడా థియేటర్లలోకి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద రెండు మాస్ మోన్స్టర్స్ తలపడనుండటం ?తిగొలిపే అంశం. ఇప్పటికే ట్రైలర్‌కు దేశీయంగా, అంతర్జాతీయంగా వచ్చిన బజ్ చూస్తే 'కూలీ' ముందుండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.




మొత్తంగా చెప్పాలంటే, రజనీ మాస్ అవతారం, లోకేష్ ఇంటెన్స్ డైరెక్షన్, అనిరుధ్ ఎనర్జిటిక్ మ్యూజిక్, మల్టీస్టారర్ క్యాస్టింగ్‌తో కలిసి 'కూలీ' ట్రైలర్ ప్రేక్షకులకు నిజమైన ఫెస్టివల్ మూడ్‌ను తీసుకొచ్చింది.

# 'కింగ్‌డమ్' ముందు పేరు 'నాగ దేవర' : విజయదేవరకొండ

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్ యువ హీరో విజయ్ దేవరకొండ తాజాగా విడుదలైన 'కింగ్‌డమ్' చిత్రంతో మళ్లీ విజయం సాధించాడు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో, నాగవంశీ నిర్మాణంలో తెరకెక్కిన ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఇక సినిమాపై ఆసక్తికర విషయాన్ని విజయ్ దేవరకొండ తాజాగా మీడియాతో షేర్ చేశాడు.

"ఇందుకు ముందు ఈ సినిమాకు 'నాగ దేవర' అనే టైటిల్‌ను అనుకున్నాం. కానీ ఎన్టీఆర్‌గారి 'దేవర' టైటిల్ ఇప్పటికే అనౌన్స్ అయిపోవడంతో, దాన్ని వదిలేసి 'కింగ్‌డమ్'గా మార్చాం" అని వెల్లడించారు. ఈ సినిమాకు సంబంధించి ఓ పాటను తొలగించిన విషయంపై కూడా విజయ్ స్పందించారు. "ఆ పాట తొలగించడం నా నిర్ణయం కాదు. డైరెక్టర్ గౌతమ్, ఎడిటర్ నవీన్ నూలి కలిసి తీసుకున్న నిర్ణయం అది. అయితే, ఆ పాటను మళ్లీ జతచేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు" అంటూ అభిమానులకు హామీ ఇచ్చారు.

ఇక 'కింగ్‌డమ్ పార్ట్-2'లో కచ్చితంగా ఒక స్టార్ హీరో నటిస్తారని ఆయన తెలిపారు. అయితే రానా నటిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. ఆ స్టార్ హీరో ఎవరనేది దర్శకుడు గౌతమ్ వెల్లడిస్తారని ఆయన అన్నారు. ప్రస్తుతం రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో ఒక సినిమాలో నటిస్తున్న విజయ్, ఇది రాయలసీమ నేపథ్యంతో రూపొందుతోంది. అలాగే రవి కిరణ్ కోలా దర్శకత్వంలో 'రౌడీ జనార్ధన్' అనే మరో మాస్ యాక్షన్